సాక్షి కర్నూలు

గురువారం । 2 । మార్చి । 2023



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాక్షి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీశైల దేవస్థానం ఈ కార్యక్రమం చేపట్టింది.



బరితెగించిన బ్లేడ్ బ్యాచ్

డోన్ పట్టణంలో బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోయింది. డబ్బుల కోసం ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడింది. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. 8లో



నిబంధన.. అయితే మాకేం!

రోడ్డు నిబంధనలు ఉన్నవి ఉల్లంఘించడానికే అన్నట్లు చాలా మంది వ్యవహరిస్తున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

డిస్కౌంట్‌తో 'లేపాక్షి' అమ్మకాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో ఎంపిక చేసిన హస్తకళల సామాగ్రిపై 40 శాతం వరకు డిస్కౌంటు ఇస్తున్నట్లు మేనేజర్ తిమ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన గిఫ్ట్ ఆర్టికల్స్, హౌస్ డెకరేషన్స్ తదితర వాటికి ఈ డిస్కౌంటు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశం మార్చి 1 నుంచి 31 వరకు ఉంటుందని తెలిపారు.

స్పాట్ బిల్లింగ్‌పై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): స్పాట్ బిల్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సూచించారు. బుధవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బిల్లులు జారీ చేయడంలో ఎలాంటి సమస్య తలెత్తరాదన్నారు. ఈ నెల 7వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేసి 100 శాతం బిల్లులు రాబట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిష్కారం చూపాలన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.84 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో 33 రోజులకు సంబంధించి కానుకలు లెక్కించారు. బుధవారం మఠం మేనేజర్ శ్రీనివాసరావు నేతృత్వంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.2,84,79,589 ఆదాయం వచ్చింది. అలాగే 35 గ్రాముల బంగారం, వెండి కేజీ 228 గ్రాములు సమకూరినట్లు మేనేజర్ వివరించారు.

ఐసీడీఎస్ పీడీ విశాఖకు బదిలీ



కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార శాఖ కర్నూలు జిల్లా అధికారిణి(ఐసీడీఎస్ పీడీ) కుమారి విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. ఏడాది పాటు ఇక్కడ విధులు నిర్వహించిన ఆమె ఇటీవల నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో వైజాగ్‌కు కోరినట్లు సమాచారం. దీంతో ఆమెను విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ బుధవారం ఆ శాఖ డైరెక్టర్ సిరి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇప్పటి వరకు ఇక్కడ ఎవరినీ నియమించలేదు.

ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని ముగ్గురు ఉపాధ్యాయులకు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వి.రంగారెడ్డి తెలిపారు. ప్రభుత్వ విధానాలను తప్పు పట్టడంతో పాటు ఓడీని దుర్వినియోగం చేస్తున్నట్లు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. హొళగుంద జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.హృదయరాజు, గోనెగండ్ల జడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ హెచ్.తిమ్మన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బాహాటంగా పాల్గొనడంతో పాటు ప్రభుత్వ విధానాలను తప్పు పడుతున్నారని, ఓడీని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. హుసేనాపురం జడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య సైతం ఇలాగే వ్యవహరిస్తున్నారని, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ద్వారా పొందిన ఓడీని దుర్వినియోగం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఈనెల 5వ తేదీ లోపు సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్లు(సీహెచ్‌వో) గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో సీహెచ్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోగుల వివరాలను సంబంధిత యాప్, పోర్టల్‌లో పొందుపరిచి తగిన నివేదికలను సమయానుసారంగా పంపించాలని ఆదేశించారు. అవసరమైన వారికి టెలీమెడిసిన్ ద్వారా చికిత్సలు అందేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డాక్టర్ చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ రజని, డాక్టర్ సుశ్మిత, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.

ఊరూవాడా పింఛన్ల పండుగ



సి.బెళగల్ మండలం పోలకల్‌లో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ హనుమన్న

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం నుంచే పండుగ వాతావరణంలో జరిగింది. పింఛన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొదటి రోజే భారీగా పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయం 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపుతట్టి పింఛన్ నగదును అందచేశారు. దీంతో అవ్వాతాతల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. పొలాల్లో పనిచేస్తున్న వారి దగ్గరికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. కర్నూలు జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,39,282 మంది ఉండగా 1,83,181 (77.41 శాతం)మందికి అందజేశారు. నంద్యాల జిల్లాలో 2,16,982 మంది లబ్ధిదారులు ఉండగా.. 1,71,989 (79.26 శాతం)మందికి పింఛన్లు అందాయి. ఈ నెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

– కర్నూలు(అగ్రికల్చర్)



నందవరం మండలం నదీకైరవాడీలో పొలంలోనే పింఛన్ అందజేస్తున్న దృశ్యం



వెల్దుర్తి మండలం రామళ్లకోటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మాలిక్‌బాషా

తల్లీబిడ్డకు ఆరోగ్య రక్ష

- ఎంసీపీ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు
- గర్భిణి ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు నమోదు
- అందులోనే శిశువుకు టీకాలు ఇచ్చిన వివరాలు
- జిల్లాలో 50 వేల మందికి పైగా కార్డుల పంపిణీ



టీకాలు వేసి ఎంసీపీ కార్డులో వివరాలు నమోదు చేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. గర్భిణులకు ఏ సమయంలో, ఎప్పుడు, ఏ పరీక్షలు చేయించారు, ఏ మందులు వాడారు, ఆరోగ్య పరిస్థితి ఎప్పుడు.. ఎలా ఉందనే వివరాలు ప్రతీదీ రికార్డులో నమోదు చేసి ఉంచుతున్నారు. అలాగే శిశువుకు టీకాలు ఇచ్చిన వివరాలు కూడా ఇందులో నమోదు చేస్తున్నారు. దీంతో మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ)కార్డు తల్లీబిడ్డకు రక్షణగా నిలుస్తోంది.

ఆరోగ్య పరీక్షల సమయాలు నమోదు

గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే మహిళ వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేస్తున్నారు. అనంతరం ఆ కార్డును గర్భిణి చేతికి ఇచ్చి, పరీక్షకు వచ్చిన ప్రతిసారీ దానిని తీసుకురావాలని ఆదేశిస్తున్నారు. ఇందులో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారం ఉంటుంది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమచారాన్ని కొత్తగా వచ్చిన ఎంసీపీ కార్డులో ప్రచురించారు. ముఖ్యంగా మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సాధారణ వైద్యపరీక్షలు, రక్తపోటు, మూత్రపరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలను నమోదు చేస్తున్నారు. కార్డులోని సమాచారాన్ని వినియోగించడం ద్వారా గర్భిణి నవమాసాలు పూర్తయిన బిడ్డ ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సహాయం వంటి పథకాల వివరాలను సైతం ఇందులో ప్రచురించారు. ఈ కార్డులో ఆరోగ్య సిబ్బంది అందించాల్సిన సేవల వివరాలతో పాటు వివిధ వ్యాధుల లక్షణాలను పేర్కొన్నారు. ఈ కార్డులను ప్రతి ఏటా జిల్లాలో 50వేల మందికి పైగా పంపిణీ చేస్తున్నారు.

అన్ని ఆసుపత్రుల్లో గర్భిణులకు చికిత్స

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలులో ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. వీటన్నింటిలో గర్భిణులకు అవసరమైన చికిత్సను అందిస్తున్నారు. ఆయా కేంద్రాలకు వెళ్లిన వారికి అక్కడి ఏఎన్ఎంలతో యాప్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నారు. అప్పటి నుంచి ప్రసవించేవరకు జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ప్రసవించిన తర్వాత కూడా శిశువుకు టీకాలు ముగిసే వరకు పర్యవేక్షణ కొనసాగుతోంది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

ఎంసీపీ కార్డుతో ఉపయోగాలు ఇవీ..

- అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల వరకు సాధారణ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఆ చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంటుంది. వీటిని అధిగమించడానికి నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేలా ఈ కార్డు రూపొందించారు.
- మహిళల్లో గర్భాశయ, ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ లక్షణాలకు సంబంధించిన సమాచారం ప్రచురించారు. సంచార చికిత్స అందించే విధానాన్ని వివరించారు.
- తొలి కాన్పులో సంభవించే సమస్యల వివరాలు, బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించే వివరాలు ఇందులో ఉన్నాయి.
- గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం వివరాలు, పిల్లలు శారీరక, మానసిక ఎదుగుదలకు సంబంధించిన అంశాలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యాన్ని కార్డులో ప్రచురించారు.
- బిడ్డ జన్మించిన వెంటనే ఈ కార్డులో నమోదు చేస్తే వెంటనే జనన ధ్రువపత్రాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అందజేస్తారు.

కార్డును ఉపయోగించుకోవాలి



తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా మాతాశిశు సంరక్షణ కార్డులను పంపిణీ చేస్తున్నాం. బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాల వివరాలు ఇందులో ఉన్నాయి. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సాధారణ వైద్యపరీక్షలు చేయించుకోవాల్సిన సమయాన్ని పొందుపరిచారు. తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించడమే దీని ప్రధాన లక్ష్యం. కార్డులో ఇచ్చిన సమాచారాన్ని ప్రతి గర్భిణి వినియోగించుకోవాలి.

– డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

జీవనోపాధులు విరిసేలా..

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వివిధ రూపాల్లో వారికి సహాయ, సహకారాలు అందిస్తూ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. తాజాగా జిల్లాలో ఆసక్తి ఉన్న రంగాల్లో పొదుపు మహిళలకు రూ.101.16 కోట్లతో జీవనోపాధుల కల్పన, అభివృద్ధికి రంగం సిద్ధం చేసింది.

- రూ.101.16 కోట్లతో కార్యాచరణ
- జిల్లాలో 17,151 మంది పొదుపు మహిళల గుర్తింపు
- స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకులు, మండల సమాఖ్యలు, గ్రామ సంఘాల ద్వారా రుణాలు
- ప్రణాళిక సిద్ధం చేసిన డీఆర్‌డీఏ–వైకేపీ



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఏఏడీఏ– అడా)ని ఏర్పాటు చేసింది. దీని పరిధిలోకి 19 మండలాలు చేర్చి వాటి అభివృద్ధికి కృషి చేస్తోంది. తాజాగా అయా మండలాల్లో ప్రతి ఏటా వలసలు వెళ్లే స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి వారికి జీవనోపాధులు కల్పించేందుకు డీఆర్‌డీఏ–వైకేపీ కసరత్తు చేస్తుంది. ఏఏడీఏ మండలాలతో పాటు మిగిలిన ఆరు మండలాల మహిళలకు కూడా ఈ సహకారం అందించనుంది. ఇప్పటికే జిల్లాలోని 928 గ్రామైక్య సంఘాలకు సంబంధించి ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించి వలస వెళ్లే మహిళలు, వారికి ఆసక్తి ఉన్న వృత్తులను గుర్తించారు.

రూ.101.16 కోట్లతో ఉపాధి

జిల్లా మొత్తం మీద పొదుపు మహిళలకు వారి ఆసక్తిని బట్టి వివిధ వృత్తుల్లో రాణించేందుకు రుణ సదుపాయం కల్పిస్తారు. ఇప్పటికే వేలాది మంది పొదుపు మహిళలు వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వం కూడా వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాలకు కింద పొదుపు మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. తాజాగా జిల్లా నుంచి వలసలను పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో సరికొత్త ప్రణాళికను సిద్ధం చేయడం విశేషం. జిల్లా మొత్తం మీద 17,151 మంది పొదుపు మహిళలు వివిధ వృత్తుల్లో ఎదిగేందుకు ఆసక్తి చూపారు. అందుకు వారికి డీఆర్‌డీఏ–వైకేపీ ఆధ్వర్యంలో రూ.101.16 కోట్ల రుణ సదుపాయం కల్పించనున్నారు. ఇందులో ఏఏడీఏ పరిధిలోని 19 మండలాల్లో 11, 304 మంది మహిళలు ఉన్నారు. వీరికి రూ.66.84 కోట్ల రుణ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్త్రీనిధి, ఉన్నతి ఉన్నాయి. స్త్రీ నిధి ద్వారా అన్ని వర్గాల వారికి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తారు. ఉన్నతి ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణ సదుపాయం ఉంటుంది. అంతేగాక బ్యాంకులు, మహిళ మండల సమాఖ్యలు, గ్రామైక్య సంఘాల ద్వారా కూడా లోన్ సదుపాయం కల్పిస్తారు. పొదుపు మహిళలకు రుణాలు ఇచ్చేందుకు నేడు బ్యాంకులు సైతం పోటీ పడుతున్నాయి. నిధులకు ఇబ్బంది లేనందున మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణింపచేసేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

162 రకాల వృత్తులపై ఆసక్తి...

వలసలు పోకుండా స్థానికంగానే రాణించేందుకు పొదుపు మహిళలు 162 రకాల వృత్తులపై ప్రత్యేక ఆసక్తి చూపినట్లు స్పష్టమవుతోంది. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో 11304 మంది మహిళలకు డీఆర్‌డీఏ–వైకేపీ సిబ్బంది వ్యక్తిగతంగా కలిసి వారికి ఆసక్తి ఉన్న వృత్తులను గుర్తించారు. అత్యధికులు పాడిపశువులు, పొట్టేళ్ల పెంపకం, గొర్రెలు, మేకలు పెంపకం, పాడి ఆవులు, కిరాణం షాపులు, టైలరింగ్/ఎంబ్రాయిడరీ, బట్టల వ్యాపారం, పెరటి కోళ్ల పెంపకం, మేక పిల్లల పెంపకం, హోటల్, స్వీట్ స్టాళ్లు, కూరగాయల వ్యాపారాలు, సోలార్ డ్రైయ్యర్, మీట్ షాపు, గాజుల వ్యాపారం, కూల్‌డ్రింక్ షాపులు, ఫ్యాన్సీ స్టోర్స్ ...ఇలా 162 రకాల వృత్తులను ఎంపిక చేసుకున్నారు. ఇలా ప్రతి వృత్తి, మహిళల సంఖ్యను బట్టి బడ్జెట్ అంచనాలు కూడా అధికారులు సిద్ధం చేశారు.

8 లోపు ఓటరు స్లిప్పుల పంపిణీ

- కలెక్టర్ కోటేశ్వరరావు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 8వ తేదీ లోపు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామని కలెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. మండలి ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం విజయవాడ నుంచి వీడి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 67,024 మంది ఉన్నారన్నారు. ఓటరు స్లిప్‌లను ప్రింటింగ్ చేయించామని, బీఎల్‌ఓల ద్వారా 8వ తేదీలోపు ఓటర్లకు పంపిణీ చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 594 ఐడీ కార్డులు సిద్ధం చేశామని చెప్పారు. మెటీరియల్ ప్రింటింగ్, ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలను 6వ తేదీలోపు పూర్తి చేస్తామని వివరించారు. ఎన్నికల నిర్వహణకు 144 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 141 మంది ఏపీఓలను నియమించామని, వీరికి 2, 6 తేదీల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 74, టీచర్ ఎమ్మెల్సీకి 27, స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సిల్వర్ జూబ్లీ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కోసం జిల్లా నుంచి నలుగురు తహసీల్దార్లను అనంతపురం పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ.. జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 56 సమస్యాత్మక, 48 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. కౌంటింగ్ కేంద్రాల ద్వారా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులందరూ వందకు వంద శాతం ఉత్తీర్ణులు కావాలని, ఇందుకోసం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పదో తరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు నెల రోజులు మాత్రమే సమయం ఉండడంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో రాత్రి, వేకువ జాముల్లో వారి ఇళ్లకు వెళ్లి చదివే విధానంపై అవగాహన కల్పిస్తున్న తీరు అద్భుతమని అభినందించారు. పాఠశాలకు ఇళ్లు దూరంగా విద్యార్థులకు సమీపంలోని సంక్షేమ హాస్టళ్లలో వసతి కల్పించి చదివించాలన్నారు. సమయం తక్కువగా ఉండడంతో డీఈఓ నుంచి సబ్జెక్ట్ టీచర్ల వరకు అందరూ పదో తరగతి పరీక్షలను ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్, డీఈఓ రంగారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ సూర్యప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండె గుడిలో అమ్మానాన్న!

- తల్లిదండ్రుల విగ్రహాలను ప్రతిష్టించిన కుమారులు



విగ్రహ ప్రతిష్టాపనలో కుమారులు, బంధువులు

కోసిగి: తల్లిదండ్రులను వారు దైవంగా భావించారు. ఆలయం నిర్మించి అందులో అమ్మానాన్న విగ్రహాలను బుధవారం ప్రతిష్టించారు. కోసిగి గ్రామానికి చెందిన బండారి ఉరుకుందప్ప స్వామి, చందనమ్మ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుమారులు బండారి సుబ్బు, మల్లికార్జున అలియాస్ దయా, మణికంఠ స్వామి రూ.30లక్షలు పోగు చేసి తల్లిదండ్రులకు గురుసుబ్బారూడ ఆలయం సమీపంలో రెండు నెలల క్రితం గుడి కట్టించారు. విగ్రహాలను తయారు చేయించి బుధవారం ఆలయంలో కుటుంబ సమేతంగా హోమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ప్రతిష్ట చేశారు. తల్లిదండ్రులు కోసం గుడి కట్టించి, విగ్రహాలు ప్రతిష్టించడంతో వీరిని గ్రామస్తులు అభినందించారు. తమ తల్లిదండ్రులు గురుసుబ్బారూడ స్వామి శిష్యులుగా ఉండేవారని, ఆలయం సమీపంలో 25 సెంట్ల స్థలం కొనుగోలు చేసి గుడి కట్టించి, విగ్రహాలు ప్రతిష్టించినట్లు ఉరుకుందప్ప స్వామి కుమారులు తెలిపారు.

టీడీపీకి అత్తర్ జాహిద్ హుస్సేన్ రాజీనామా



బనగానపల్లె: తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బనగానపల్లె పట్టణానికి చెందిన అత్తర్ జాహిద్ హుస్సేన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. రాజీనామా లేఖను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడుకు పంపినట్లు బుధవారం విలేకరులకు వెల్లడించారు. క్రియాశీలకంగా పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు లేదని, దీనికితోడు అనుమానాలు, అవమానాలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తను పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజకపాలన అందిస్తున్నారని కొనియాడారు. త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

కర్నూలులో శాశ్వత లోక్ అదాలత్ కేంద్రం

- చైర్మన్‌గా జస్టిస్ ఎం.వెంకట హరినాథ్ నియామకం



కర్నూలు(లీగల్): ప్రజా ఉపయోగ సేవల్లో లోపంపై తలెత్తే సత్వర న్యాయం పొందేందుకు కర్నూలులో శాశ్వత లోక్ అదాలత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ జిల్లా జడ్జి ఎం.వెంకట హరినాథ్‌ను ఈ కేంద్రానికి చైర్మన్‌గా నియమించారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాసదన్‌లో కొత్తగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో లోపం జరిగితే ఇక్కడ ఫిర్యాదు చేసి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. రవాణా, పోస్టల్, టెలిఫోన్, విద్యుత్, శానిటరీ, బ్యాంకింగ్, మెడిసిన్, బీమా సేవల్లో అసౌకర్యాలు కలిగితే కేసులు వేసుకుని పరిష్కారం పొందవచ్చన్నారు. అలాగే ఆర్థిక సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యాసంస్థలు (ప్రైవేటు, ప్రభుత్వం), గృహ నిర్మాణం, రియల్ ఎస్టేట్ సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఎటువంటి కోర్టు ఫీజు లేకుండా కోటి రూపాయల వరకు పరిహారం కలిగిన కేసులకు పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. ఇరు పార్టీలు రాజీ కాకపోతే ఫైనల్‌గా కేసు అవార్డును పాస్ చేస్తామని, ఆ అవార్డును సవాలు చేయడానికి వీలు లేదన్నారు. ఇక్కడ అవార్డును జిల్లా కోర్టు ద్వారా అమలు జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

సీహెచ్‌సీలో వృద్ధురాలికి శస్త్ర చికిత్స


వృద్ధురాలికి శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ అభినవ్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓ వృద్ధురాలికి బుధవారం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైంది. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ సమీపంలో నివాసం ఉంటున్న వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలి కాలికి ఇనుప ముక్క కుచ్చుకుని మోకాలి వరకు ఇన్‌ఫెక్షన్ అయి ఆసుపత్రిలో చేరింది. సీహెచ్‌సీలో అన్ని వసతులు అందుబాటులో ఉండటంతో డాక్టర్ అభినవ్‌రెడ్డి, స్టాఫ్‌నర్స్ జ్యోతి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ బాషా ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే శాస్త్ర చికిత్సను విజయవంతంగా చేయడంతో రోగి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

రూ.1.27 కోట్ల స్కూల్ గ్రాంట్ విడుదల

కర్నూలు కల్చరల్: జిల్లాలోని 1,434 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, సీనియర్ ఉన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంట్‌ను విడుదలైందని ఏపీ సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. రెండో విడత కింద మొత్తం స్కూల్ గ్రాంట్‌లో 20 శాతం రూ.1,27,06,000 విడుదలైందన్నారు. పీఎఫ్ఎంఎస్ స్కూల్ గ్రాంట్ బ్యాంక్ అకౌంట్‌కు నిధులు జమ అవుతాయని, ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్స్ సరిచూసుకోవాలని తెలిపారు.

నిబంధన.. అయితే మాకేం!

- యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు
- మద్యం మత్తులో రోడ్డెక్కుతున్న వాహనదారులు
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్
- జరిమానాలు విధిస్తున్నా మారని తీరు

కర్నూలు: సీటు బెల్టు పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలని పోలీస్, రవాణా శాఖ అధికారులు పదే పదే చెబుతున్నా వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా కొద్ది మంది మాత్రమే స్పందిస్తున్నారు. రోడ్డు నిబంధనలు ఉన్నవి ఉల్లంఘించడానికే అన్నట్లు చాలా మంది వ్యవహరిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సురక్షిత ప్రయాణానికి నీళ్లొదులుతున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. తప్పని తెలిసినా ట్రిబుల్ రైడ్ చేయడం, పిల్లలకు వాహనాలు ఇవ్వడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి పనులు చేస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పెరుగుతున్న మైనర్ డ్రైవింగ్

పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్న ప్రేమతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. రోడ్డు భద్రత గురించి, ట్రాఫిక్ నిబంధనలు తెలియని మైనర్లు అతి వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనం నడిపే సామర్థ్యం ఉందని, వాహనాన్ని నియంత్రించగల మనే అతి నమ్మకం వారిని ప్రమాదాలకు గురయ్యేలా చేస్తోంది. అతి వేగంగా వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడుతున్నారు. లేదంటే ఎదుటి వారి ప్రమాదానికి కారకులవుతున్నారు. గత నెల 18వ తేదీన కర్నూలు అవుట్ డోర్ స్టేడియం నుంచి కాంగ్రెస్ కార్యాలయం వైపు ముగ్గురు మైనర్ బాలలు బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కిందపడగా మనోహర్ (17) మృతిచెందాడు. పోలీసులు ప్రత్యేకంగా మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఈ నెలలో జిల్లాలో 166 కేసులు నమోదయ్యాయి. పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు ఉన్నాయి.

ట్రిబుల్ రైడింగ్.. వెరీ ట్రబుల్

ఎక్కువగా కళాశాల స్థాయి యువకులు ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులు వారికి అవగాహన కల్పించకపోవడం ముఖ్య కారణం. కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తూ యువకులకు పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోంది. ఎవరైనా పట్టుబడితే తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విద్యార్థులు, యువత బాధ్యత గుర్తెరగాలి.



సీటు బెల్టు తప్పనిసరి



సీటు బెల్టు పెట్టుకుంటే ఇబ్బందిగా ఉందని భావించకూడదు. అనుకోకుండా కారు ప్రమాదానికి గురైనప్పుడు అద్దానికి, స్టీరింగ్‌కు తల తాకి, ఛాతీ ఒత్తుకుని చనిపోయేవారు అధికమని గుర్తించాలి. సీటు బెల్టు ధరించకపోవడంతో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే శోభానాగిరెడ్డి, కర్నూలు మాజీ ఎంపీ రాజవర్ధన్‌రెడ్డి వాహన ప్రమాదంలో మృతిచెందినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. కారు ముందు భాగంలో కూర్చునే ప్రయాణికులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించేలా పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ...

పని ఒత్తిడి కారణంగా సమయం వృథా ఎందుకని భావించి కొందరు వాహన డ్రైవింగ్‌లోనే సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఎమ్మిగనూరుకు చెందిన ఓ వ్యక్తి శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో ఫోన్ రింగ్ అవ్వడంతో ఒక చేతితో సెల్‌ఫోన్ మాట్లాడుతూ మరో చేతితో డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా అడ్డు వచ్చిన గేదెను తప్పించబోయి వాహనాన్ని అదుపు చేయలేక కింద పడి కాలు విరిగి దివ్యాంగుడిగా మారాడు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మూడుసార్లు పట్టుబడిన తర్వాత మళ్లీ అదే ఉల్లంఘనకు పాల్పడితే పోలీసు శాఖ లైసెన్స్ రద్దు సిఫారసుకు కసరత్తు చేస్తోంది.

హెల్మెట్‌పై అశ్రద్ధ

హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుందని, కొందరు తలపై అదనపు భారం అనే అపోహతో ధరించడం లేదు. హెల్మెట్ తప్పనిసరి అంటూ పోలీసులు అవగాహన కల్పించడంతో పాటు ధరించని వారికి తరచూ జరిమానాలు విధిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం జరుగుతున్నాయి. పదేపదే ఉల్లంఘనలకు పాల్పడే వారు తనిఖీల్లో పట్టుబడితే జరిమానాలు విధించడమే కాక కఠిన చర్యలు ఉంటాయి.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

జరిమానాలు విధిస్తున్నా కనిపించని మార్పు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. జిల్లాలో గత నాలుగేళ్లలో హెల్మెట్ ధరించని వారిపై రూ.1.12 కోట్లు జరిమానా విధించారు. రెండేళ్ల వ్యవధిలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న కేసులు 12 వేలకు పైగా నమోదయ్యాయంటే వాటి తీవ్రతకు అద్దం పడుతోంది. జరిమానా రూపంలో వీరు రూ.1.22 కోట్లు చెల్లించారు. అలాగే రాంగ్‌రూట్ కేసులు మూడేళ్లలో పది వేలకు పైగా నమోదయ్యాయి. ఎక్కువ ప్రమాదాలు రాంగ్‌రూట్ డ్రైవింగ్ వల్లే అనే విషయం పలు సంఘటనల్లో బయటపడింది. వీరు రూ.97.58 లక్షలు జరిమానా రూపంలో చెల్లించారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే (గత నెల) వాహనదారులు ఉల్లంఘించిన కేసులకు రూ.72.88 లక్షలు జరిమానా రూపంలో చెల్లించారు.

జిల్లాలో గత నెల వాహనదారులపై నమోదైన కేసుల వివరాలు

ట్రిబుల్ రైడింగ్‌తో పట్టుబడిన కేసులు	: 1,351
సెల్‌ఫోన్ మాట్లాడుతూ నమోదైన కేసులు	: 353
సీటు బెల్టు ధరించకపోవడం	: 552
డ్రంకెన్ డ్రైవ్‌తో పట్టుబడిన కేసులు	: 954
హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన కేసులు	: 7721
మైనర్ డ్రైవింగ్ కేసులు	: 166

డ్రంకెన్ డ్రైవ్



లారీ, ఆటోడ్రైవర్లు కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారు. మద్యం మనతో పాటు ఎదుటివారి ప్రాణాలను ప్రమాద రూపంలో బలిగొంటుందన్న విషయాన్ని వాహనచోదకులు గమనించాలి. పోలీసులు రాత్రివేళ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

జరిమానాల వివరాలు ఇలా...

సెల్‌ఫోన్, రాంగ్ రూట్ డ్రైవింగ్	:రూ.1035
హెల్మెట్ ధరించకపోతే	: రూ.120
ట్రిబుల్ రైడింగ్	: రూ.335
మైనర్ డ్రైవింగ్	: రూ.1535
ఓవర్ స్పీడ్, సీటు బెల్టు ధరించకపోవడం	: రూ.435

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆదోని రూరల్: అలసందగుత్తి గ్రామానికి చెందిన బోయ చిన్నఈరన్న(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదోని పోలీసుల వివరాల మేరకు.. బోయ చిన్న ఈరన్నతో భార్య గొడవపడి తన పిల్లలతో పాటు గత నెల 27వ తేదీన పుట్టినిల్లు అయిన కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి వెళ్లింది. ఇంటిలో ఒక్కడే ఉన్న బోయ చిన్న ఈరన్న బుధవారం ఉదయం 7 గంటల సమయంలో నోటిలో నుంచి నురుగు వస్తుండగా చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకున్నాడా? మృతి మరే ఇతర కారణమేదైనా ఉందే అనే విషయాలు తెలియ రాలేదు. పోస్టుమార్టం నివేదికలో వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

డోన్ పురపాలక సంఘము

బహిరంగ వేలము నోటీసు

రెక.నెం. 109/2020/ఏ1 తేది: 01.03.2023

కౌన్సిల్ తీర్మానము నెం. 137, తేది: 30-12-2022నకు లోబడి ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు మరియు వేలం పాటదారులకు తెలియచేయునది ఏమనగా డోన్ పురపాలక సంఘమునకు చెందిన దినసరి కూరగాయల మార్కెట్టు, వారపు సంత మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్టు మరియు జంతు వధశాల కిస్తులకు సంబంధించిన రుసుమును వసూలు చేసుకొను హక్కును అర్ధ సంవత్సర కాలమునకు అనగా తేది: 01.04.2023 నుండి అనగా తేది: 31.03.2024 వరకు లీజు హక్కు పొందుటకు డోన్ పురపాలక సంఘ ఆవరణములో తేది: 10-03-2023 శుక్రవారము ఉదయం గం.11-00 ల నుండి బహిరంగ వేలము వేయబడునని తెలియజేయడమైనది.

ఈ క్రింది తెలిపిన మేరకు ఆయాపద్దులకు కట్టవలసిన ధరావత్తు, సాల్వెన్సీ వివరములు

వ నెం.	పద్దు వివరములు	కట్టవలసిన వేలము ధరావత్తు	వ్యక్తిగత సాల్వెన్సీ	పూచికత్తు సాల్వెన్సీ
1	దినసరి కూరగాయల మార్కెట్టు	రూ. 13.00 లక్షలు	రూ.13.00 లక్షలు	రూ. 13.00 లక్షలు
2.	బస్టాండు ఫీజు	రూ. 15.00 లక్షలు	రూ.15.00 లక్షలు	రూ. 15.00 లక్షలు
3.	వారపు సంత మార్కెట్టు	రూ. 6.00 లక్షలు	రూ.6.00 లక్షలు	రూ. 6.00 లక్షలు
4.	జంతు వధశాల మరియు మాంసపు మార్కెట్టు	రూ. 2.00 లక్షలు	రూ.2.00 లక్షలు	రూ. 2.00 లక్షలు

పై వేలము షరతులకు లోబడి వేలము వేయబడును. కావున ఆసక్తి గల వారందరు సదరు వేలములో పాల్గొనుటకు ముందు రోజు అనగా తేది: 09.03.2023 గురువారము లోపు డి.డి.లు ఈ కార్యాలయమునకు సమర్పించవలెను చెక్కులు స్వీకరించబడవు. హెచ్చు వేలము పాటదారుని డిపాజిట్ నుండి వేలము పాట మరియు గూడ్సు సర్వీసు టాక్స్ (జి.యస్.టి) మరియు స్టాంపు డ్యూటీ మినహాయించుకొని తదుపరి తేదీన తిరిగి మిగిలిన మొత్తము తమరికి ఇవ్వబడును. సాల్వెన్సీ భూమిపై తహశీల్దారు వారి ద్వారా లేదా ఇండ్లపై మునిసిపల్ కమిషనర్ వారి ద్వారా మాత్రమే పొంది హాజరు పరచవలెను. వేలము షరతులు తదితర విషయములు ఆఫీసు పని చేయు వేళలలో వచ్చి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు, డోన్ పురపాలక సంఘం

ఉద్యమ తరహాలో ప్రకృతి వ్యవసాయం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మద్దూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుగుమందులు, రసాయన ఎరువులను అడ్డగోలుగా వాడటం వల్ల కలిగే అనర్థాలను, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమ తరహాలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంటు లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, రీసెర్చ్ కో-ఆర్డినేటర్ లీలావతి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే వాహనాల సీజ్

కర్నూలు(రాజ్‌విహార్): జగన్నాథగట్టుతో పాటు చుట్టు పక్క ప్రాంతాల నుంచి మట్టి, మైనింగ్‌ను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని గనులు, భూగర్భ శాఖ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. జగన్నాథగట్టు కొండపై జరుగుతున్న అక్రమ తవ్వకాలపై 'కొండ ప్రశ్నించదని.. అధికారులకు కళ్లు లేవని..!' శీర్షిక న బుధవారం 'సాక్షి'లో ఫొటోస్టోరీ ప్రచురితమైంది. ఇందుకు ఆయన స్పందించారు. కొండ ప్రాంతం సుమారు 700 ఎకరాలు ఉండగా.. ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ, లా యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ కళాశాల, హైకోర్టుకు కొంత భూములు కేటాయించిందన్నారు. అయితే పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారుల సహకారం ఉంటేనే అక్కడ మట్టి అక్రమ తరలింపు, మైనింగ్‌ను అడ్డుకోవడం సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా కేటాయించిన భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా శాఖలపై కూడా ఉందని, భూముల చుట్టూ కంచె వేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని, వాహనాలు సీజ్ చేయడంతో పాటు ఆర్ఆర్ యాక్టు ప్రయోగిస్తామన్నారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితిపై గనుల శాఖ డైరెక్టర్‌కు పూర్తి సమాచారం ఇచ్చామని, ఆయన నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక మొబైల్ టీంను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న జేసీఎస్ మండల ఇన్‌చార్జీలు

కడప కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికలను జేసీఎస్ మండల ఇన్‌చార్జీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం శిల్పారామం కన్వెన్షన్ హాలులో ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల జేసీఎస్(జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు) మండల ఇన్‌చార్జీలతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేది ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను మనవైపు తిప్పుకోవడానికి కసరత్తు చేయాలన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కీలకంగా పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు కలుపుకుని 6.16 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సౌకర్యాల కల్పన కోసమే డీబీటీ ద్వారా నగదు ఖాతాలకు జమ చేయడం జరుగుతోందని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో సమూల మార్పులు తీసుకు రావడం జరిగిందన్నారు. ఇలాంటి విషయాలన్నీ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులే హంతకులు!

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


హత్యకు గురైన మురళీకృష్ణ



నిందితులు దినేష్ కిరణ్

కర్నూలు: నగరంలోని ఎర్రబురుజుకు చెందిన మురళీకృష్ణ(22)ను స్నేహితులే హతమార్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. కర్నూలు ఎర్రబురుజుకు చెందిన పెద్ద గోపాల్, రాధమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా, మూడవ కుమారుడైన మురళీకృష్ణ సాయిబాబా గుడి వద్ద ఉన్న ఫ్లవర్ డెకరేషన్ షాప్ నిర్వాహకుడు మోహన్ దగ్గర గుమాస్తాగా పనిచేసేవాడు. ఇతను బాలాజీ నగర్‌కు చెందిన ఎరుకలి దినేష్‌కు స్నేహితుడు. దినేష్ డిగ్రీ చదువుతున్నాడు. దినేష్ సెల్‌ఫోన్‌లో ప్రేమికురాలితో కలసి ఉన్న వీడియోలను కొన్ని నెలల క్రితం మురళీకృష్ణ తన సెల్‌ఫోన్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుని ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. దీంతో మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. దినేష్ ఈ విషయం తెలుసుకుని మురళీకృష్ణను హత్య చేయాలని పథకం పన్నాడు. జనవరి 25వ తేదీన శివమాలలో ఉన్న మురళీకృష్ణ బాలాజీ నగర్‌లోని ఒక వేడుక కార్యక్రమంలో ఫ్లవర్ డెకరేషన్ చేస్తుండగా ముందుగా పథకం వేసుకున్న ప్రకారం దినేష్, అతని మరో స్నేహితుడు కిరణ్ కలసి కర్నూలు మండలం పంచలింగాల వద్ద ఉన్న స్కంద వెంచర్ దగ్గరకు తీసుకువెళ్లారు. అక్కడ కత్తితో పొడిచి గాయపరిచారు. అతను తిరగబడటంతో సమీపంలో ఉన్న నీటిలో ముంచి హత్య చేసి మృతదేహాన్ని అక్కడే వదిలి నిందితులిద్దరూ బాలాజీ నగర్‌కు చేరుకున్నారు. దుస్తులు మార్చుకున్న తర్వాత నంద్యాల చెక్‌పోస్టులో ఒక ఆటోను అద్దెకు తీసుకుని వారే స్వయంగా నడుపుకుంటూ మృతదేహం వద్దకు వెళ్లారు. హతుడి ఒంటిపై దుస్తులు తొలగించి వెంచర్‌లో ఉన్న సిమెంటు రింగులో దాచారు. ఆటోలో మృతదేహాన్ని తీసుకుని హైవే మీదుగా రింగు రోడ్డుపై వెళ్లి నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువలో పడేశారు. ఫిబ్రవరి 16వ తేదీన హతుని తల్లి రాధమ్మ తన కుమారుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేయడంతో కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తుండగా పోలీసులు గాలిస్తున్నట్లు నిందితులు దినేష్, కిరణ్ అనుమానపడి బుధవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు ఎదుట లొంగిపోయి చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో ఈ కేసును హత్య కేసుగా మార్పు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తాలూకా సీఐ రామలింగమయ్య తెలిపారు. మృతుడు ధరించిన శివమాల డ్రస్సును స్వాధీనం చేసుకుని మృతదేహం కోసం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో అగ్నిమాపక శాఖ సహకారంతో గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బరితెగించిన బ్లేడ్ బ్యాచ్

- డబ్బుల కోసం ఇద్దరు వ్యక్తులపై బ్లేడ్‌లతో దాడి
- ఒకరి పరిస్థితి విషమం


తీవ్ర రక్తగాయాలతో సోమశేఖర్‌గౌడ్


గాయాలు చూపుతున్న మూగ వ్యక్తి

డోన్ రూరల్: పట్టణంలో బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోయింది. మంగళవారం అర్ధరాత్రి డబ్బుల కోసం ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పాత సంతమార్కెట్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద సోమశేఖర్‌గౌడ్ (45) అనే మానసిక రోగితో పాటు మరో మూగ యువకుడు మంగళవారం రాత్రి నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు వారిపై బ్లేడ్‌లతో దాడి చేశారు. శరీరంపై విచక్షణారహితంగా కోసి వారి వద్ద ఉన్న రూ. 250 తీసుకుని పారిపోయారు. తీవ్ర రక్తగాయాలతో అచేతనంగా పడి ఉన్న వీరిని తెల్లవారుజామున ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యుడు పానిపూరి మురళి గమనించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. సోమ శేఖర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. దాడికి గురైన ఇద్దరి కుటుంబ వివరాలు తెలియవు. వీరు రోజూ రాత్రిపూట ఫ్లఓవర్‌బ్రిడ్జి కింద తల దాచుకుంటారని స్థానికులు తెలిపారు. కాగా బ్లేడ్ బ్యాచ్ దాడి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలకు వైద్యవిద్యార్థులు

- రొటేషన్ పద్ధతిలో మూడు నెలల పాటు సేవలు

కర్నూలు(హాస్పిటల్): నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వుల మేరకు వైద్య విద్యార్థులు పల్లెబాట పట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు బుధవారమే ఆయా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లారు. ఇందుకోసం కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి 130, విశ్వభారతి నుంచి 40, శాంతిరామ్ మెడికల్ కాలేజీ నుంచి 44 మంది రెండో సంవత్సరం పీజీ వైద్య విద్యను చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మూడు కాలేజీలకు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. ఆయన ఈ మూడు కాలేజీల విద్యార్థులను రొటేషన్ పద్ధతిలో మూడు నెలల షిఫ్ట్ ప్రకారం ఆయా జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలకు కేటాయిస్తున్నారు. ఆ వివరాలను డీసీహెచ్ఎస్‌కు పంపిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో వైద్య విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆయా ఆసుపత్రుల్లో వైద్య విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. మూడు నెలల పాటు వీరు ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులకు సహాయకులుగా పనిచేస్తారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారికి వచ్చే వ్యాధులు తెలుసుకోవడంతో పాటు వారితో మమేకం కావడం వల్ల పీజీ వైద్య విద్యార్థులకు మరింత నాణ్యమైన ప్రాక్టికల్ వైద్యవిద్యను అభ్యసించేందుకు ఉపయోగపడుతుందని ఎన్ఎంసీ భావిస్తోంది. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీకి ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి, డోన్ ఏరియా ఆసుపత్రి, నందికొట్కూరు, ఆత్మకూరు, మిడుతూరు, ఓర్వకల్, వెల్దుర్తి, పాణ్యం సీహెచ్‌సీలు, విశ్వభారతి మెడికల్‌కాలేజీకి ఎమ్మిగనూరు, కోడుమూరు ఆసుపత్రులు, శాంతిరామ్ మెడికల్ కాలేజీకి బనగానపల్లి, బేతంచెర్ల, కోవెలకుంట్ల, యాళ్లూరు, వెలుగోడు ఆసుపత్రులను కేటాయించారు.

పెండింగ్ చలనాలు చెల్లించండి

బొమ్మలసత్రం: ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వాహనదారులు పెండింగ్ చలానాలు వెంటనే చెల్లించాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ఫిబ్రవరి నెలలో పోలీసులు పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఇందులో 2,761 చలనాలకు సంబంధించి రూ. 8 లక్షలు వసూలు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.